మట్టి కుండ.. ఆరోగ్యానికి అండ!

- వేసవిలో పెరగనున్న మట్టి పాత్రల వినియోగం
- కుండలు, కడవల తయారీలో కుమ్మరులు
- ఐదారు నెలల పాటు ఆదాయం


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కడవలు



మట్టి కడవలు తయారు చేస్తున్న దృశ్యం

పరిగి: ఎండాకాలంలో మట్టి పాత్రలకు ఎంతో ప్రాధ్యాన్యముంటుంది. మట్టి పాత్రలోని నీళ్లు తాగితే ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయ్.. బయటకు వెళ్లాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఇప్పటికే గరిష్టంగా 37 నుంచి 40 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా మనిషి రోజుకు కనీసం 5 నుండీ 6 లీటర్ల నీటిని తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. తాగే నీటిలో లవణీయత లోపిస్తే త్వరగా రోగాల బారిన పడతారు. అలాంటి బాధల నుంచి మట్టి కుండ నీరు ఉపశమనం కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. మట్టి కుండలు, కడవల్లోని నీటిలో ఖనిజ లవణాలు, రోగ నిరోధక శక్తి ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. బ్యాక్టీరియా, వైరస్ వంటి క్రిముల, గొంతు ఇన్‌ఫెక్షన్లను తగ్గుతుంది. సహజ గుణాలున్న మట్టి కుండల నీటిని వడదెబ్బబారిన పడిన వారికి తాగిస్తే త్వరగా కోలుకుంటారు. గతంలో మట్టి పాత్రలకు ప్రాధాన్యం మూడు దశాబ్దాల క్రితం గ్రామాల్లో ఏ ఇంట చూసినా మట్టి కుండలు, మట్టి పాత్రలు, ఇతరత్ర వస్తువులు ఉండేవి. అప్పట్లో పట్టణాల్లో సైతం మట్టితో తయారు చేసిన వస్తువులు వాడేవారు. ఎలక్ట్రికల్ వస్తువులు అందుబాటులోకి వచ్చాక మట్టి కుండలకు బదులు ఫ్రిజ్‌లు కొంటున్నారు. కాలానుగుణంగా వచ్చిన మార్పుల్లో నేడు ఆధునిక సమాజంలో ఫ్రిజ్‌ల వాడకం రోజురోజుకూ పెరిగిపోయింది. తాగునీటి బాటిళ్లతో పాటూ కూరగాయలు, ఆకుకూరలు, గ్రుడ్లు, ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్ ఫ్రిజ్‌లలో ఉంచడం పరిపాటైపోయింది. దీంతో మట్టితో తయారు చేసిన గృహోపకరణాలు ఇండ్లలో కనిపించని పరిస్థితి దాపురించింది. మట్టి కుండల్లో నీరు శ్రేయస్కరమని తెలిసినప్పటికీ జనం ఎలక్ట్రిక్ ఫ్రిజ్‌లను విరివిగా వాడుతున్నారు. మట్టితో తయారైన కుండల్లోని నీరు తాగితే శరీరానికి హాని కలిగించే క్రిములు నశిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు.

మట్టి కుండల కొనుగోలుకు ఆసక్తి

ఒకప్పుడు ఏడాది పొడవునా మట్టి కుండలు వాడే పరిస్థితి ఉండేది. పండుగకు కొత్త కుండలు, మట్టి పాత్రలు కొనుక్కుని వినియోగించుకునేవారు. పగిలితే అందుబాటులో ఉన్న తయారీ ప్రాంతానికి వెళ్లి తెచ్చుకునేవారు. ప్రస్తుతం వేసవి కాలంలో మాత్రమే మట్టి కుండలు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనపరుస్తున్నారు. మట్టి కుండల తయారీదారులకు ఐదారు నెలల పాటూ ఉపాధి అవకాశాలుంటాయి. ఫిబ్రవరి నుంచి జూన్ ఆరంభం వరకూ మట్టి కుండలు తయారు చేస్తుంటారు. క్రమంగా గిరాకీలు తగ్గడంతో కుమ్మరులు ఇతరత్రా కూలి పనులకు వెళ్లి జీవనోపాధిని సాగిస్తున్నారు.

కుల వృత్తితో జీవనోపాధి



భార్యతో కలిసి ఎండాకాలం సీజన్‌లో మాత్రమే కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతంలో ఏడాది పొడవునా తయారీ పని దొరికేది. ప్రస్తుతం ఐదారు నెలలే అది కూడా కుండలు మాత్రమే తయారు చేయడానికి వీలవుతోంది. మిగిలిన సీజన్‌లో ఉపాధి పనులు, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తాం. కుటుంబమంతా కష్టపడి రోజుకు 30 మట్టి కుండలను తయారు చేస్తున్నాం. – **శ్రీరామప్ప, కుండల తయారీదారుడు, పైడేటి**

ప్రభుత్వం ప్రోత్సహించాలి



గతంలో రోజుకు కనీసం వందకు పైగా కుండలు తయారు చేసేవారం. నేడు అలాంటి పరిస్థితి లేదు. ఇంతవరకూ మాకు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందలేదు. ఒక ట్రాక్టరు బంకమట్టితో దాదాపు 500 కుండల తయారీకి దాదాపు 5 వేల వరకూ ఖర్చవుతుంది. సీజన్ కాబట్టి ఒక్కో మట్టి కడవ రూ.150కు విక్రయిస్తాం. కుమ్మరులను గుర్తించాలని కోరుతున్నాం. – **క్రిష్టప్ప, కుండల తయారీదారుడు, పరిగి**

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌ను కలిసిన ఆనంద రంగారెడ్డి, అగళి మండల నాయకులు

మడకశిర: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు ఆనంద రంగారెడ్డి తెలిపారు. పార్టీని అందరూ కష్టపడి కలిసి కట్టుగా పని చేసి బలోపేతం చేయాలని అధినేత సూచించినట్లు తెలిపారు. ఆయనతో పాటు వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నితిన్‌రెడ్డి కూడా ఉన్నారు.

అగళి: మండల కేంద్రంలోని మాజీ మండల కన్వీనర్ మహేంద్రప్ప, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బీదురమ్మ చంద్రప్ప విజయవాడలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను గురువారం కలిశారు. వీరితోపాటు పలువురు నాయకులు జగన్‌ను కలిశారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం


పేస్ట్, బ్రష్ అందజేస్తున్న ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయబాబు

హిందూపురం టౌన్: దంత సంరక్షణతో ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు, దంత సర్జన్ డాక్టర్ భూపాలం విజయబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి దంత విభాగంలో ఆధ్వర్యంలో డీఈఐసీ కేంద్రంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది 'సంతోషకరమైన నోరు ఒక సంతోషకరమైన మనస్సు' నినాదంతో దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు. నోటి ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు మధ్య సంక్లిష్ట సంబంధాన్ని పెంచుతుందన్నారు. ఆరోగ్యకరమైన నోరు ఆత్మగౌరవాన్ని పెంచుతుందని తెలిపారు. మంచి నోటి ఆరోగ్య అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం చికిత్స నిమిత్తం వచ్చిన వారికి పేస్టు, బ్రష్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ప్రేమ్ కుమార్, సాంకేతిక సహాయకులు లోకేష్, చైతన్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు

హిందూపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు అధికమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెడ్పీ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ ఆఫీసులో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోరంట్ల మండలం బూదిలి గ్రామంలో దళితుల ఇల్లు కూల్చివేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి దళితులను ఆర్థికంగా సామాజికంగా ఎదగనివ్వడం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కావాలని కేవీపీఎస్ పోరాటాల ఫలితంగా నిధుల కేటాయింపులు జరిగాయన్నారు. ఆర్డీటీ సంస్థ ఉమ్మడి జిల్లాలో దళితుల అభ్యున్నతికి రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తోందన్నారు. ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. డప్పు కళాకారులకు రూ.7 వేల పెన్షన్ సాధనకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాటికాపర్ల సంఘం జిల్లా కార్యదర్శి యోగనంద్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, చౌడప్ప, నరసింహులు, రాయుడు, జ్యోతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసాద వితరణ కార్యక్రమం


రొళ్ల లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్‌ను పూలతో అలంకరించిన దృశ్యం


రొళ్ల భూతప్పస్వామి ఆలయం వద్ద ప్రసాదాన్ని ఉంచి పూజలు చేస్తున్న దృశ్యం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భూతప్ప ఆలయం వద్ద 101 ప్రసాద వితరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు భక్తి శ్రద్ధలతో సమర్పించిన వడి బియ్యం, బెల్లం, బ్యాళ్లు ఇతరాత్ర పిండి పదార్థలతో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భూతప్ప ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచారు. ఉత్సవాల సందర్భంగా వేకువజాముున లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామి మూల విరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, భక్తులు కానుక రూపంలో ఇచ్చిన పట్టువస్త్రాలు, పూలతో విషేశంగా అలంకరణ చేసి, మహామంగళారతి చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. భూతప్పల ప్రతిమల ఎదుట భక్తులు విశేషంగా సమర్పించిన వడి బియ్యం, బెల్లం, బ్యాళ్లు ఇతరాత్ర పిండి పదార్థాలతో తయారు చేసిన ప్రసాదాన్ని ఉంచి పూజలు చేశారు. ప్రసాదాన్ని దక్కించుకోవడం కోసం భక్తులు ఎగబడ్డారు. నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు : రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రంతో ముగియనున్నాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటరు జాబితాలో సవరణలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్ కుమార్


సమీక్షిస్తున్న ఈఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి

మడకశిర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఐదు మండలాల తహసీల్దార్లు, అఖిల పక్షం నాయకులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్‌సీసీ), తాలూకా ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ) సూర్యనారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 1,200 మంది ఓటర్లు పైబడి ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉంటే బూత్ లెవెల్ అధికారులతో నివేదికలు తెప్పించుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. రెండు కిలోమీటర్ల లోపు మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉంటే ముందే గుర్తించి, అన్ని విధాలుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు 18 ఏళ్లు నిండిన వారితో ఫారం –6 ద్వారా కొత్తగా ఓటరు జాబితాలోని చేరడం కోసం దరఖాస్తులు స్వీకరించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, అఖిల పక్షం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

పెనుకొండ రూరల్: ఓటరు జాబితాలోని పలు అంశాలపై ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఆర్డీఓ ఆనంద్ కుమార్ గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో సవరణలు ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చూడాలన్నారు. 1400 ఓటర్లు పైబడిన చోట అదనంగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లు ఒకే చోట ఓటువేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

మడకశిర: మండలంలోని 90 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపాధ్యాయ భవన్, ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. పోషణ, విద్య తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనాలు చేశారు. స్థానిక సీడీపీఓ నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్ రాకపై హర్షం

హిందూపురం టౌన్: తొమ్మిది నెలల అనంతరం వ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా భూమి మీదకు చేరుకోవడంతో పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం సంబరాలు చేసుకున్నారు. రంగురంగుల బెలూన్లను ఎగురవేసి ఆనందం వ్యక్తం చేశారు. అరవై ఏళ్ల వయసులో అంతరిక్ష పరిశోధనలు చేసిన వ్యోమగామి సునీత విలియమ్స్ ఈతరం యువతులందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, యశోదా దేవి, శ్రీధర్, భోజప్ప, సరస్వతి, ప్రకాష్‌రావు, సుబ్బరాయుడు, బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సత్ప్రవర్తన ముఖ్యమే


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రామకృష్ణ

అగళి: విద్యార్థులకు చదువుతోపాటు సత్ప్రవర్తనా ముఖ్యమేనని కెరీర్ గైడెన్స్,మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక కేజీబీవీలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సెషన్ నిర్వహించారు. విద్యార్థి దశలో పిల్లల ప్రవర్తనలో మార్పు వస్తుండడం సహజమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుంకం వసూలుకు 26న బహిరంగ వేలం

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, బస్టాండ్ పార్కింగ్ స్థలం సుంకాల వసూలుకు ఈనెల 26న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట ఉంటుందని కమిషనర్ రంగస్వామి తెలిపారు. పలుమార్లు వేలం వాయిదా పడిందని తెలిపారు.

కలుషిత నీటి సరఫరాపై ఆగ్రహం

చిలమత్తూరు: మండల పరిధిలోని మిత్ర వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామాలకు కలుషితమైన నీటిని సరఫరా చేస్తున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడూరు తోపు సమీపంలోని మిత్ర వాటర్ ప్లాంట్‌ను వారు గురువారం పరిశీలించారు. ట్యాంక్‌లలో నీరు పాచి పట్టడాన్ని గమనించారు. పాచి పట్టిన నీటిని సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. నీటిని ఏమాత్రం శుద్ధి చేయకుండా సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, వైద్య బృందం శుద్ధ జల కేంద్రాలను తనిఖీ చేయలేదన్నారు. ఇలాంటి నీటిని సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, మరాచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ: మండలంలోని చిగతుర్పిలోని నూతన కాలనీలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు బోరుబావిని తవ్వించినట్లు సర్పంచ్ శివరుద్రమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్ గురువారం తెలిపారు. మూడు నెలలుగా నీటి సమస్య ఉండడంతో కాలనీవాసులు వ్యవసాయ బోరుబావుల వద్దకెళ్లి తెచ్చుకునేవారు.

క్లుప్తంగా

ప్రజా అవసరాలకు ఉపయోగించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని సచివాలయం–1 వెనక భాగాన ఉన్న మాడగడ్డ స్థలాన్ని ప్రజా అవసరాలకు మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని గురువారం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఓ వర్గం వారు ఆ స్థలంలో కంచె వేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని కంచె వేయరాదని అడ్డుకున్నారు. వివాదస్పద స్థలంలో ఎటువంటి ఆధారాలు లేకుండా కంచె వేయడం కుదరదన్నారు. ఆ స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలమన్నారు. ఉన్నతాధికారులతో చర్చించిన తరువాత ఈ భూమిని ప్రజాప్రయోజనాల కోసం కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాగి, వరి పంటల పరిశీలన

లేపాక్షి: గొంగిటిపల్లి గ్రామంలో రైతులు శ్రీనివాస రెడ్డి, దివాకర్ రెడ్డి, కళావతమ్మ, చౌడిరెడ్డి సాగు చేసిన రాగి, వరి పంటలను డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వరిలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అదేవిధంగా వరిలో పొటాష్ ఎరువు వాడకం ఆవశ్యకతను వివరించారు. ఎకరాకు దుక్కిలో 25 కేజీలు వాడాలని తెలిపారు. పంట నాటిన 18–20 రోజుల తరువాత కౌన్సిల్ ఆక్టివ్ 90 గ్రాములు ఎకరానికి కలుపు మందులు వాడి కలుపును నివారించవచ్చని పేర్కొన్నారు. రాగిలో వకుల, తిరుమల రకాలను సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, సిబ్బంది పుష్పలత, తిరుమలేష్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం సమీపంలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో సోమందేపల్లికి చెందిన బాషా అనే యువకుడి కారు ఢీకొంది. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు .. బాషా అనే యువకుడు రోడ్డు దాటుతుండగా కియా పరిశ్రమకు చెందిన కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న యువకులు మోటర్ బైక్‌లపై వెంబడించి సోమందేపల్లి సమీపంలో బాషాను ఢీకొన్న కారును పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సమావేశం

అమరాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11:30 గంటలకు సమావేశం ఉంటుందని తహసీల్దార్ లక్ష్మీనరసింహ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ, ఫారెస్ట్ అధికారి, దేవదాయ శాఖ, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, ఎస్‌హెచ్ఓలు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

ట్రైసైకిల్‌ను ఉపయోగించుకోండి


చెత్త సేకరిస్తున్న కార్మికులు

అమరాపురం: తమ్మడేపల్లి, అమరాపురం గ్రామాల్లో చెత్త సేకరణ ట్రై సైకిల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ నాగముని, కార్యదర్శి సుధాకర్‌లు ప్రజలను కోరారు. గురువారం అమరాపురం, తమ్మడేపల్లిలో పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్తను సేకరించారు. ఆ చెత్తను సంపద తయారీ కేంద్రంలో వేసి ఎరువును ఉత్పత్తి చేస్తామని ఈఓఆర్డీ తెలిపారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు


బీఈఓ కార్యాలయం

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా జరగనున్నాయి. స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ విలేకరులతో మాట్లాడారు. పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తాలూకా వ్యాప్తంగా పది పరీక్షలకు మొదటి సారిగా 2,850 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొత్తం 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల సమయం వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి గది లోనూ ఒక ఉన్నత అధికారిని నియమించామన్నారు. 3 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామని, వీటితో పాటు జిల్లా స్థాయి మొబైల్ టీం లు గస్తీ తిరుగుతాయన్నారు.

దేదీప్య మానం.. పూల రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

పావగడ: తాలూకాలోని వదనకల్లులో వెలసిన తిప్పేరుద్ర స్వామి పూల రథోత్సవం దేదీప్యమానంగా సాగింది. సాయంత్రం సాగిన పూల రథం గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింది. దారి పొడవునా భక్తులు పూల తేరుకు నీరాజనాలు పలికారు. ఆలయంలో ఉదయం స్వామి వార్లకు ఆకుల పూజ, ప్రాకారోత్సవం, మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకల్లో ఆలయ సమితి అధ్యక్షుడు రవి ప్రకాశ్, మాజీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి తదితర పదాధికారులు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద ఆస్పత్రి వార్షికోత్సవం


త్రిమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మించి 27 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్వాహకుడు ఎం పాల్ అందించిన రామకృష్ణ పరమహంస, శారదా దేవి, స్వామి వివేకాంద ప్రతిమలను ప్రతిష్ట చేసి పూజలు నిర్వహించారు.

తుంగభద్ర నీరు విడుదల


తాగునీటిని పరిశీలిస్తున్న ఏఈఈ కావ్య

పావగడ: తాలూకా ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న తుంగభద్ర తాగు నీరు ఎట్టకేలకు గురువారం వచ్చింది. తాలూకా లోని కోటగుడ్డ , శైలాపురం గ్రామాల్లో మొదటి సారిగా వచ్చిన తుంగ భద్ర నీటిని ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటింటికీ కొళాయిల్లో బిందె లలో పట్టుకున్న మహిళలు ఎంతో సంబరపడు తున్నారు. తుమకూరు జెడ్పీ పావగడ విభాగానికి చెందిన గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ శాఖ ఇంజనీర్లు తుంగభద్ర తాగు నీటిని పరీక్షించారు. ఏఈఈ కావ్య, జేఈ బసవలింగ పాటిల్, తుంగభద్ర ప్రాజెక్ట్ మెగా కంపెనీ అధికారి అశోక్ నవీన్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా మహిళా ఉద్యోగుల సంఘం ఎన్నిక


మహిళా ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు వీరే

మడకశిర: నియోజకవర్గం తాలూకా ఎన్జీవో మహిళా ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, మహిళ విభాగం అధ్యక్షురాలు జమీరాబేగం, రాజేశ్వరి, మడకశిర ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు రాము సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మడకశిర తాలూకా ఎన్జీవో మహిళ విభాగం అధ్యక్షురాలిగా శ్రీదేవి, కోచైర్‌పర్సన్‌గా షిఫాకౌసర్, కన్వీనర్‌గా కౌసర్‌బేగం, కోశాధికారిగా లలితమ్మ, వైస్ చైర్‌పర్సన్‌లుగా మేఘన, హారతి, సునీత, మేరీసుందరమ్మ, కోకన్వీనర్‌గా లీలావతి, సంయుక్త కన్వీనర్లుగా నాగమణి, కావ్య, రాధలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యదర్శి సభ్యులను మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు శాలువా కప్పి సన్మానించారు.